క్లుప్తంగా

స్త్రీనిధి రుణాలు వినియోగించుకోండి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కోల్‌సిటీ: స్వశక్తి మహిళలు స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జె.అరుణశ్రీ అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో రామగుండం పట్టణ సమాఖ్య ప్రతినిధులు, ఆర్పీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రతీ సమాఖ్యలో అర్హులందరూ స్త్రీనిధి రుణాలు పొందేలా అన్ని సంఘాలకు ఈకేవైసీ ముందుగానే తయారు చేయాలన్నారు. సమావేశంలో డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ సతీశ్, స్త్రీనిధి రీజినల్ మేనేజర్ దుర్గాప్రసాద్, టౌన్ మిషన్ కోఆర్డినేటర్ మౌనిక, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

వీర్లపల్లిలో శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లి గ్రామంలో బుధవారం పారిశుధ్యం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని రోడ్లపై పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించారు. ప్రధాన మురుగుకాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, ఆడెపు శ్రీనివాస్, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలకు నంబర్ ప్లేట్ తప్పనిసరి



తనిఖీ చేస్తున్న సీఐ రాజేశ్వర్‌రావు

జ్యోతినగర్: రోడ్డుపై వెళ్లే వాహనాలకు తప్పనిసరిగా నంబర్ ప్లేట్లు ఉండాలని రామగుండం ట్రాఫిక్ సీఐ బి.రాజేశ్వరరావు అన్నారు. ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ రాజీవ్ రహదారి వద్ద బుధవారం ఎస్సై హరిశేఖర్ సిబ్బందితో కలిసి ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలతో పాటు పెద్ద సౌండ్ చేస్తున్న సైలెన్సర్ ఉన్న వాహనాలకు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

మంత్రి శ్రీధర్‌బాబుపై ఆరోపణలు సరికాదు

రామగిరి: నిత్యం అభివృద్ధి కోసం శ్రమించే రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబుపై బీఆర్‌ఎస్ నాయకులు చేసిన ఆరోపణలు సరికాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రొడ్డ బాపన్న అన్నారు. మండలంలోని సెంటినరికాలనీ శ్రీపాదభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు మంత్రిపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ నాయకులు బర్ల శ్రీనివాస్, ఆరెల్లి కొమురయ్య, కొరుకొప్పుల తులసీరాం, తీగల సమ్మయ్య, ఎల్లె రామ్మూర్తి, గంట వెంకటరమణారెడ్డి, మైదం వరప్రసాద్, బండారి సదానందం, మోత్కూరి అవినాష్, పొన్నం సత్యనారాయణ, మల్లేశ్ పాల్గొన్నారు.

మట్టి డంపింగ్ అడ్డగింత

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం జల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని సింగరేణి ప్రైవేట్ వీ9 కంపెనీ కాంట్రాక్టర్లు అక్రమంగా మట్టిని డంపింగ్ చేయడాన్ని జల్లారం గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని కొంతమంది పేర్లు తప్పిపోయిన వారికి పరిహారం చెల్లించలేదన్నారు. 2008 నుంచి 2025 వరకు ఉన్న విద్యార్థులకు కనీసం ఎక్స్‌గ్రేషియా ఇవ్వకుండానే సింగరేణి ఆర్జీ–1 పరిధిలోని సింగరేణి ముంపు గ్రామంలో ఓబీ మట్టిని ఎలాంటి సమాచారం లేకుండానే అక్రమంగా నిల్వ చేస్తున్నారంటూ గ్రామస్తులు ఆందోళన చేస్తూ డంపింగ్‌ను అడ్డుకున్నారు. గ్రామంలోని నిరుద్యోగులకు సింగరేణి వారు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న గోదావరిఖని టూటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

శ్రీలక్ష్మీనృసింహుడి కల్యాణం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాక గ్రామంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శ్రీలక్ష్మీనృసింహుడి కల్యాణం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

- డీపీవో వీర బుచ్చయ్య



మాట్లాడుతున్న డీపీవో వీర బుచ్చయ్య

సుల్తానాబాద్: గ్రామాల్లో నిర్వహిస్తున్న పలు రకాల దుకాణాలకు కార్యదర్శులు ట్రేడ్ లైసెన్సులు ఇవ్వాలని డీపీవో వీర బుచ్చయ్య ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సాయంత్రం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 100శాతం పన్నులు వసూలు చేయాలని సూచించారు. ఈనెల 10 నుంచి 14 వరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కొనసాగుతుందని, ప్రతీ గ్రామంలో చేయాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. సమావేశంలో ఎంపీవో సమ్మిరెడ్డి, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ఓదెలలో ప్రత్యేక సమావేశం

ఓదెల: గ్రామాల్లో ఇంటిపన్నులు వందశాతం వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య ఆదేశించారు. ఓదెల ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శి, ఆపరేటర్లతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ కార్యదర్శులు లైబ్రరీ సెస్ పన్నులు జమ చేయాలని, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు దారుల నుంచి ఫీజులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీవో షబ్బీర్ పాల్గొన్నారు.

సింగరేణి అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు



అధికారులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

రామగిరి: మండలంలోని లద్నాపూర్‌లో బుధవారం ఎల్6 కాలువ వద్ద పనులు నిర్వహించడానికి వచ్చిన సింగరేణి అధికారులను గ్రామస్తులు అడ్డుకున్నారు. పునరావాస కేంద్రంలో రాముడి ఆలయ నిర్మాణం చేపట్టాలని, పునరావాస కాలనీలో అభివృద్ధి పనుల విషయంలో సరైన నిర్ణయం తీసుకునే వరకు పనులు జరగనివ్వబోమని అధికారులకు తెలిపారు. అధికారులను నమ్మి సర్వం కోల్పోయి ఇళ్లు ఖాళీ చేసి వెళ్తే పునరావాస కేంద్రాల్లో సరైన వసతులు లేవని, కనీసం డ్రైనేజీ నిర్మాణాలు కూడా చేపట్టలేదని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు. అధికారులను ప్రశ్నిస్తే సరైన సమాధానం తెలపడం లేదన్నారు. గ్రామంలో ఇళ్లకు పగుళ్లు ఏర్పాడి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నామని వాపోయారు. బ్లాస్టింగ్‌లు తమ సమీపంలో జరగడంతో దుమ్ము, ధూళితో అనారోగ్యానికి గురవుతున్నామన్నారు. ఈ విషయంపై ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావును వివరణ కోరగా లద్నాపూర్ భూనిర్వాసితులకు కేటాయించిన పునరావాస కేంద్రాలలో మౌళిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పనులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పూర్తి చేస్తామన్నారు.

కనుల పండువగా రథోత్సవం



రథోత్సవంలో భక్తులు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో రథోత్సవం బుధవారం శోభాయమానంగా నిర్వహించారు. ఆలయం నుంచి రథోత్సవంలో దేవతామూర్తుల విగ్రహాలను గుడి మిట్టపల్లి శివాలయం వరకు తరలించారు. దేవతామూర్తుల విగ్రహాలను శుద్ధి కార్యక్రమంలో భాగంగా తెప్పోత్సవం నిర్వహించారు. రథోత్సవం పట్టణంలోని పురవీధుల మీదుగా సాగింది. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ శ్రవణ్ కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పల్ల మురళీధర్, పాలకమండలి సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు

కాల్వశ్రీరాంపూర్: అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ముందస్తుగా కాల్వశ్రీరాంపూర్ పోలీసులు మాజీ సర్పంచులను, వీఆర్‌ఏలను మంగళవారం రాత్రి అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాజీ సర్పంచులు, వీఆర్‌ఏలను అదుపులోకి తీసుకుని సొంత పూచీ కత్తుపై బుధవారం వదిలిపెట్టారు.

సర్పంచుల అరెస్టు అప్రజాస్వామికం

జూలపల్లి: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసిన సర్పంచ్‌లకు రావాల్సిన బిల్లులను మంజూరు చేయాలని అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వగా, మాజీ సర్పంచులను ముందే అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు వ్యతిరేకమని బీజేవైఎం జిల్లా సీనియర్ నాయకుడు జ్యోతిబసు అన్నారు. మాజీ సర్పంచులను ముందస్తుగా అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. సర్పంచులు మల్లేశం, ఎలిగేడు మండల సర్పంచులు కొండయ్య, కొండాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఓసీపీ–2లో వందశాతం బొగ్గు ఉత్పత్తి

రామగిరి: 2024–25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని ఆర్జీ–3 ఏరియాలోని ఓసీపీ–2 గని ముందుగానే సాధించిందని జీఎం నరేంద్ర సుధాకర్‌రావు పేర్కొన్నారు. జీఎం కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఓసీపీ–2 గనికి నిర్దేశించిన 27.50 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి 20రోజుల ముందుగానే 100శాతం ఉత్పత్తి సాధించినందుకు సంబంధిత అధికారులకు, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. లక్ష్యాన్ని సాధించడంలో సహకరించిన సీఅండ్‌ఎండీ ఎన్.బలరాం, డైరెక్టర్లు, కార్మిక సంఘాల నాయకులకు, ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వేలంలో పాల్గొనడం సరికాదు



మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని: బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి పాల్గొనడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు బ్లాకులు దక్కించుకునేందుకు వేలం పాటల్లో పాల్గొంటే సింగరేణి సంస్థకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కోయగూడెం, సత్తుపల్లి బ్లాక్‌ల వేలానికి వ్యతిరేకంగా చేసిన పోరాట ఫలితంగా వేలంలో గనులను దక్కించుకున్న సంస్థలు భయపడి అక్కడ అడుగు పెట్టలేదన్నారు. వేలంలో పాల్గొనే పద్ధతిని వెంటనే ఉపసంహరించుకోకపోతే కార్మికుల నుంచి వ్యతిరేకత చవిచూడాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. సమావేశంలో నాయకులు నూనె కొమురయ్య, వడ్డేపల్లి శంకర్, పింగిలి సంపత్‌రెడ్డి, నాగెల్లి సాంబయ్య, చెల్పూరి సతీశ్, చల్ల రవీందర్‌రెడ్డి, చిలకలపల్లి శ్రీనివాస్, కొంద్ర అంజయ్య, వాసర్ల జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డోలోత్సవం



పల్లకిలో స్వామివారి ఊరేగింపు

యైటింక్లయిన్‌కాలనీ: స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి డోలోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌తో కాలనీ పురవీధుల గుండా ఊరేగిస్తూ ఆలయం నుంచి షాపింగ్ కాంప్లెక్స్ మీదుగా తెలంగాణ చౌరస్తా నుంచి ఆలయం వరకు స్వామివారిని పల్లకిలో ఊరేగించారు.

ప్రత్యేక పారిశుధ్య పనుల పరిశీలన

ఎలిగేడు: మండల కేంద్రంతో పాటు లాలపల్లె, ధూళికట్ట, లోకపేట గ్రామాల్లో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనులను ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో ఆరిఫ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామీణ నర్సరీతో పాటు పారిశుధ్యం, తాగునీటి వసతులు, క్రీడా ప్రాంగణాలను పరిశీలించారు. ఎంపీడీవో భాస్కర్‌రావు మాట్లాడుతూ పారిశుధ్యం, తాగునీటి సరఫరాలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఓదెల: మండలంలోని గూడెం సబ్‌స్టేషన్ పరిధి గుంపులలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈఈ మోహన్ నాయక్ బుధవారం తెలిపారు. గుంపులలో ఉదయం 11నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

సంక్షిప్త వార్తలు

- **నిబంధనలకు లోబడి పనిచేయాలి**

సుల్తానాబాద్: దస్తావేజుల లేఖర్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి పనిచేయాలని రిజిస్ట్రేషన్ స్టాంపుల జిల్లా అధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. సుల్తానాబాద్‌లోని రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ చేస్తున్న క్రమాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. సుల్తానాబాద్ సబ్ రిజిస్ట్రార్ బాకం ఓంప్రకాశ్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

- **ఇద్దరిపై కేసు నమోదు**

సుల్తానాబాద్‌రూరల్: ట్రాలీ ఆటోలో నాలుగు మూగజీవాలను తరలిస్తున్న ఇద్దరిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. వీణవంక మండలానికి చెందిన నల్రావుల మహేశ్, నల్రావుల కొండయ్య ఓదెల మండలం కనగర్తి నుంచి ట్రాలీ ఆటోలో ఆవు, లేగ దూడ, బర్రె, ఎద్దులను తాళ్లతో క్రూరంగా బంధించి కరీంనగర్ వైపునకు తరలిస్తున్నారు. కాగా సుల్తానాబాద్‌లో గోరక్షక సమితి సభ్యులు పృథ్వీరాజ్, సాయికిరణ్ చూసి ఆటోను అడ్డుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. విచారణ అనంతరం ఇద్దరిపై కేసు నమోదు చేసి, మూగజీవాలను గోసంరక్షణ కేంద్రానికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

- **గ్రామపంచాయతీ ట్రాక్టర్ బ్యాటరీ చోరీ**

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం ఎల్కలపల్లి గ్రామపంచాయతీ ట్రాక్టర్ బ్యాటరీని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని పంచాయతీ కార్యదర్శి ముత్యాల రమ బుధవారం ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీ ట్రాక్టర్ బ్యాటరీ పాడవడంతో ఇటీవల నూతన బ్యాటరీని ట్రాక్టర్‌కు అమర్చారు. పంచాయతీ కార్యాలయంలో ట్రాక్టర్ నిలిచి ఉండగా మంగళవారం రాత్రి ట్రాక్టర్ బ్యాటరీని దొంగలు ఎత్తుకెళ్లారని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్ కిరణ్ పేర్కొన్నారు.

- **ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య**

ముత్తారం: మండలంలోని రామకృష్ణాపూర్(ఇప్పలపల్లి)కి చెందిన చొప్పరి శ్రీనివాస్(48) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం శ్రీనివాస్ పిడుగుపాటుతో అనారోగ్యానికి గురై కొన్నేళ్ల నుంచి మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. చికిత్స నిమిత్తం మంథనికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు పేర్కొన్నారని స్థానికులు తెలిపారు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ పేర్కొన్నారు.

20లీటర్ల నాటుసారా పట్టివేత

మంథని: మండలంలోని గోపాల్‌పూర్ అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ, రవాణా జరుగుతుందనే సమాచారం మేరకు బుధవారం వాహన తనిఖీలు నిర్వహించినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. మండంలోని ధర్మారం గ్రామానికి చెందిన చిన్న ఓదెలు అతడి కుమారుడు వినయ్ బైక్‌పై గోపాల్‌పూర్ నుంచి ధర్మారం 20లీటర్ల నాటుసారా రవాణా చేస్తుండగా పట్టుబడినట్లు పేర్కొన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐ సాయికుమార్, సిబ్బంది శ్యామ్, రాజ్‌కుమార్ ఉన్నారు.

- **విద్యాబోధనపై అవగాహన**

ధర్మారం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వసతులు విద్యాబోధనపై అవగాహన కల్పించారు. మండలంలోని ధర్మారం, బొమ్మారెడ్డిపల్లి, గోపాల్‌రావుపేట గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ట్విన్నింగ్ కార్యక్రమం నిర్వహించారు.

- **తహసీల్దార్ ఎదుట బైండోవర్**

రామగిరి: మండలంలోని పన్నూర్, నాగెపల్లి, వకీల్‌పల్లి ఫ్లాట్స్, బేగంపేట గ్రామాలకు చెందిన జి.సాయి కుమార్, జి.పద్మ అలియాస్ తిరుపతమ్మ, ఎస్.సాగర్, బి.రాజేశ్, ఎస్.శ్రీనివాస్ నాటుసారా విక్రయిస్తూ పట్టుబడ్డారు. వీరిని బుధవారం ఎక్సైజ్ ఎస్సై సాయికుమార్ తహసీల్దార్ సుమన్ ఎదుట బైండోవర్ చేశారు.

20లీటర్ల నాటుసారా సీజ్

మండలంలోని బేగంపేటలో బుధవారం 20 లీటర్ల నాటుసారా సీజ్ చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. బేగంపేట అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ చేస్తున్నారని సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి మంథని ఎక్సైజ్ శాఖ వారు సంయుక్తంగా దాడి చేశారు. ఈ దాడిలో నాటుసారా పట్టుబడగా సీజ్ చేశారు.


- **ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య**

మంథని: ప్రభుత్వ కళాశాలల్లో చేరి ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కళాశాలకు చెందిన అధ్యాపకులు అన్నారు. మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన అధ్యాపకులు నూతన డిగ్రీ అడ్మిషన్ల కోసం మంథనిలో ఉన్న బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేశారు.

- **మున్నూరుకాపులు ఐక్యంగా ఉండాలి**

సుల్తానాబాద్: మున్నూరుకాపు సంఘం సభ్యులు ఐక్యంగా ఉండాలని మున్నూరుకాపు సంఘం మున్సిపల్ గౌరవాధ్యక్షుడు గాజుల రాజమల్లు కోరారు. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు (సుగ్లాంపల్లి)లో బుధవారం మున్నూరుకాపు కుల సభ్యత్వ నమోదు చేపట్టారు. మున్నూరుకాపు కుల జనాభా ఇతర సమాచార దృష్ట్యా వివరాలు సేకరించడానికి ఒక ఫాం ఏర్పాటు చేసి వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. మున్నుకాపు సంఘం అధ్యక్షుడు బిరుదు రాధాకృష్ణ, ముత్యాలు, శేఖర్, తిరుపతి, కుమారస్వామి, కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గాజుల అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న పుట్ట మధుకర్

రామగిరి: నియోజకవర్గంలో ఇసుక లారీలతో సుమారుగా 35 మంది మృతి చెందారని, వారి కుటుంబాలకు రూ.50లక్షల పరిహారం చెల్లించాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ డిమాండ్ చేశారు. రోడ్డు ప్రమాదంలో కల్వచర్లకు చెందిన దొంతుల వాణి ఇటీవల మృతిచెందింది. కాగా ఆమె కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబాలకు పరిహారం ఇప్పించాలని కోరారు. అనంతరం కల్వచర్ల, లొంకకేసారం గ్రామాలకు చెందిన పలు కుటుంబాలను పరామర్శించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణగౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శంకేశీ రవీందర్, గ్రామ శాఖ అధ్యక్షుడు జాపతి శేఖర్, భాస్కర్, ఆసం తిరుపతి, బొంకూరి పోచం, మల్యాల మోహన్, ఆసం తిరుపతి, సత్యనారాయణ, అశోక్ పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

ఆసుపత్రి సౌకర్యాలు వినియోగించుకోవాలి



ట్రేడ్‌మిల్ ప్రారంభిస్తున్న జీఎం వెంకటయ్య

గోదావరిఖని: కార్మిక కుటుంబాల కోసం ఏర్పాటు చేస్తున్న ఆస్పత్రిలోని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య కోరారు. క్రయో థెరపీ, హైజీలైట్, అల్ట్రా సౌండ్ మసాజర్ పరికరాలను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ ఉద్యోగులకు పక్షవాతం, ఆపరేషన్స్‌తో బిగుసుకుపోయిన కండరాలను మసాజ్ చేయడం ద్వారా మామూలు స్థితిలోకి ఈయంత్రాల ద్వారా తీసుకురావచ్చన్నారు. ఏఐటీయూసీ నాయకులు జీగురు రవీందర్, ఏజెంట్ నెహ్రూ, పర్సనల్ డీజీఎం అనిల్‌కుమార్, గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రి ఏసీఎంవో డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ మహిపాల్ పాల్గొన్నారు.

ఆర్జీ–2లో క్వార్టర్ల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జీఎం వెంకటయ్య

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 ఏరియాలోని ఉద్యోగులకు బుధవారం క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆర్జీ–2 జీఎం వెంకటయ్య పాల్గొని కౌన్సెలింగ్ చేపట్టారు. ఇటీవల క్వార్టర్ల కౌన్సెలింగ్ ద్వారా కేటాయించినా అలాట్ లెటర్ తీసుకోని కార్మికులకు వాటిని రద్దు చేశారు. సీనియారిటీ ప్రకారం క్వార్టర్లు అలాట్ చేశారు. కౌన్సెలింగ్‌లో 32 మంది ఉద్యోగులు పాల్గొనగా వారిలో 20మందికి క్వార్టర్లు కేటాయించినట్లు జీఎం పేర్కొన్నారు. ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ జీగురు రవీందర్, డీజీఎం పర్సనల్ ఎస్.అనిల్ కుమార్, అధికారులు మురళీకృష్ణ, ప్రతాపరాజు, వేణుగోపాల్, షరీఫ్‌మహ్మద్, క్వార్టర్ సెక్షన్ ఇన్‌చార్జి క్లర్క్ మమత పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా శ్రమించాలి



నృత్యం చేస్తున్న మహిళలు

గోదావరిఖని: మహిళా సాధికారతే లక్ష్యంగా శ్రమించాలని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య అన్నారు. స్థానిక ఎస్‌సీవోఏ క్లబ్‌లో సేవా అధ్యక్షురాలు వనజ అధ్యక్షతన బుధవారం జరిగిన మహిళా దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తూ అనేక విజయాలు సాధిస్తున్నారన్నారు. సంస్థలో కూడా మహిళలు అన్ని విభాగాల్లో మంచి పనితీరు కనబరుస్తున్నారన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సంస్థ ముందుకు సాగుతోందన్నారు. సంస్థ స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా మహిళలకు ప్రత్యేక శిక్షణ అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. యూనియన్ నాయకులు జీగురు రవీందర్, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, ఏజీఎం వర్క్‌షాప్ ఎర్రన్న, డీజీఎం ఐఈడీ మురళీకృష్ణ, ఫైనాన్స్ డీజీఎం వెంకట రామచంద్ర, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్, మహిళా ఉద్యోగులు, లేడీస్ క్లబ్ సభ్యులు, సేవా మహిళలు, ఫ్యాకల్టీ మహిళలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ బి.రాజుగౌడ్

రామగిరి: సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంథని సీఐ బొల్లపల్లి రాజుగౌడ్ అన్నారు. మండలంలోని బేగంపేటలో ఎస్సై చంద్రకుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు డయల్100, సైబర్ నేరాలు, రోడ్డు సేఫ్టీ, మాదక ద్రవ్యాల వినియోగంతో జరిగే నష్టాలు, సీసీ కెమరాల ఉపయోగంపై బుధవారం అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో యువత గంజాయి, మద్యం, గుట్కా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, ఒకవేళ ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. గ్రామాల్లో మాదక ద్రవ్యాల సరఫరాపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్సై పురుషోత్తం దివ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యమే రైతులకు శాపం

ముత్తారం: ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్టు ద్వారా ముత్తారం మండలం చివరి ఆయకట్టుకు సాగునీరు అందకపోవడానికి గత పదేళ్లలో బీఆర్‌ఎస్ పాలకుల నిర్లక్ష్యమేనని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ ఆరోపించారు. ముత్తారంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. పార్టీ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, నాయకులు గాదం శ్రీనివాస్, బక్కతట్ల వినీత్, లక్కం ప్రభాకర్, చొప్పరి సంపత్, కోల విజయ్, పీక శంకర్ ఉన్నారు.

దోమల నియంత్రణకు ఫాగింగ్

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధి గడిమహల్‌లో దోమల నియంత్రణకు ఫాగింగ్ చేపట్టారు. బుధవారం రాత్రి శానిటేషన్ సిబ్బంది దోమల నియంత్రణకు ప్రత్యేకంగా ఫాగింగ్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పలు కాలనీల్లో జ్వరాలు ప్రబలుతున్నందున పలువురు ఫిర్యాదు మేరకు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ తెలిపారు.

పిచ్చిమొక్కలు, ముళ్లపొదల తొలగింపు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ 17, 18వ డివిజన్ల ఏరియాల్లో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. సంతోష్ నగర్ నుంచి నిర్మించిన ప్రధాన మురికి కాలువ 18వ డివిజన్ ఏరియా అల్లూరు రోడ్డు మీదుగా వెళ్తున్న డ్రైనేజీ కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని, ముళ్లపొదలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. శానిటరీ సూపర్‌వైజర్ సారయ్య, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూములు కాపాడాలి

మంథని: మంథని మున్సిపాలిటీతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గువుతోందని సీపీఎం నాయకులు ఆరోపించారు. పట్టణంలోని గిరిజన కళాశాల ఎదురుగా పోచమ్మ గుడి వెనకాల ఉన్న ప్రభుత్వ భూమి కబ్జా గురయ్యే ప్రయత్నం జరుగుతోందని సీపీఎం పార్టీ బృందం బుదవారం పరిశీలించింది. రెవెన్యూ అధికారులు మంథనిలోని ప్రభుత్వ భూముల చుట్టూ హద్దులు వేసి హెచ్చరికబోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గణేశ్, నాయకులు సందీప్, రవి, లింగయ్య తదితరులు ఉన్నారు.

షాపు ఎదుట మహిళల ఆందోళన

గోదావరిఖని: మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడని పేర్కొంటూ స్థానిక లక్ష్మీనగర్‌కు చెందిన ఓషాపు ఎదుట బుధవారం బాధితులు ఆందోళన చేశారు. పక్కషాపులో పనిచేస్తున్న మహిళకు ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడటంతో సదరు మహిళ ఈ విషయాన్ని తోటి మహిళలకు తెలిపింది. దీంతో పలువురు మహిళలు షాప్ వద్దకు వచ్చి ఆందోళన చేశారు. విషయాన్ని ముందే గమనించిన షాప్ యజమాని అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులకు విషయం తెలియడంతో షాపు యజమానిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈవిషయంపై వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డిని ఫోన్‌లో సంప్రదించగా ఇప్పటివరకు ఫిర్యాదు రాలేదన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను వినియోగించుకోవాలి

ఎలిగేడు: ప్రభుత్వం భూమి రెగ్యులరైజేషన్ స్కీం అమలు చేస్తోందని, ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో భాస్కర్‌రావు సూచించారు. మండలంలో 19 మంది ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారని, క్రమబద్ధీకరణకు మార్చి31లోపు రుసుం చెల్లిస్తే 25శాతం వెసులుబాటు ఉంటుందని వివరించారు. ఎల్‌ఆర్‌ఎస్‌తో భూముల ధరలు పెరగడంతో పాటు ఇంటి నిర్మాణానికి సులభంగా అనుమతి పొందవచ్చని వివరించారు. సేల్‌డీడ్ ప్రకారం చట్టబద్ధంగా రెగ్యులరైజేషన్ అవుతుందని పేర్కొన్నారు.